అపూర్వ విద్యార్థులు

- సంపాదనలో కొంత సేవలకు.. మరికొంత పాఠశాలల అభివృద్ధికి..
- స్ఫూర్తినిస్తున్న 2006-07 పదోతరగతి విద్యార్థులు
- తల్లిదండ్రులు లేని పిల్లలకు చేయూత

యూసు‌ఫ్‌గూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చదువును కష్టంతో కాకుండా ఇష్టంగా చదివారు. పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల 2006-2007 పదోతరగతి విద్యార్థులు. మొత్తం 170 మంది విద్యార్థులు ఉండగా, 85 శాతం మంది పాస య్యారు. వీరంతా ఒక గ్రూప్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. చిన్ననాటి గుర్తులను నెమరేసుకునేందుకు ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న విద్యార్థి

సంపాదనలో కొంత సమాజానికి..

2006-2007 విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. సంపాదనలో కొంత సమాజ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహరిస్తున్నారు. పేద పిల్లలకు నోట్, పాఠ్య పుస్తకాలను అందిస్తున్నారు. తండ్రి, తల్లి లేని పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నారు. ఈ విద్యార్థుల స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం అని పూర్వ ఉపాధ్యాయులు పేర్కొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తల్లిదండ్రులే స్ఫూర్తి



మా అమ్మ, నాన్న ప్రభుత్వ ఉద్యోగులే. 2007లో 431 మార్కులతో పదోతరగతి పాసయ్యాను. సమయం వృథా చేయకుండా కష్టపడి చదివాను. 2017లో ట్రాన్స్‌పోర్టు ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభు త్వ ఉద్యోగం పొందాను. నేటి తరం విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి. సోషల్ మీడియాను పక్కకు పెట్టాలి.

- కనకాల దీపిక, జూనియర్ అసిస్టెంట్

టీచర్ కావాలనుకుని పోలీస్‌నయ్యా



నా చదువంతా ప్రభుత్వ బడి, కళాశాలలోనే సాగింది. చిన్నతంలోనే నాన్న చనిపోయారు. అక్క వాళ్ల సహకారంతో పై చదువులు చదువుకున్న. టీచర్ కావాలని బీఈడీ చేసి టెట్‌లో అర్హత సాధించాను. 2020లో పోలీస్ శాఖలో కొలువు వచ్చింది. నేటి తరం విద్యార్థులు ఇంటి వద్ద ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదవాలి.

● చిట్టూరి శ్రీనివాస్

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదవాలి

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకొని చదివాను. ఎన్‌సీసీలో నేషనల్ షూటర్‌ని. ఆటల్లో ప్రథమ స్థానంలో ఉన్నాను. ఈ రెండింటి ఫలితంగా 2018లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందాను. మా కుటుంబంలో నాదే మొదటి ప్రభుత్వ ఉద్యోగం.

● జి.నవనీత, కానిస్టేబుల్


వినాయకనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో భూమి పూజ చేసిన కబ్జాదారులు

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు భూమిపూజ

- కబ్జాదారులపై కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు కొంతమంది. భూమిపూజ కూడా చేశారు. రెవెన్యూ సిబ్బంది స్పందించి స్థలంలో సూచిక బోర్డు పెట్టడంతోపాటు కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ వినాయకరావునగర్‌లో ప్రభుత్వానికి చెందిన 400 గజాల స్థలం ఉంది. స్థానికంగా ఉండే నారాయణమ్మ, తట్టి రాములు, శ్రీశైలం, బాబురావు తదితరులు స్థలాన్ని ఆక్రమించేందుకు ఈనెల 27న భూమి పూజ చేశారు. సమాచారం అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి వెంటనే స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, శ్రీశైలం అనే వ్యక్తి స్థానికంగా నిర్మాణంలో ఉన్న గుడికి చెందిన 50 గజాల స్థలాన్ని ఆక్రమించాడని బస్తీనాయకులు గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.


వినతిపత్రం ఇస్తున్న మోతీనగర్‌వాసులు

మోతీనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ కో-ఆపరేటివ్ సొసైటీలో ప్రస్తుతం జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టడంతోపాటు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని కాలనీవాసులు సోమవారం సొసైటీ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యుడు చెన్నారెడ్డి మాట్లాడుతూ సొసైటీ ఏర్పడి దాదాపు 50 సంవత్సరాలు అవుతున్నప్పటికీ అభివృద్ధిలో వెనకబడి ఉందన్నారు. ప్రత్యేక సదుపాయాలు కల్పించడంలో ప్రస్తుత మేనేజింగ్ కమిటీ విఫలమైందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు డాక్టర్ ఎస్వీ ప్రసాద్, తులసీదాస్, పీఎస్ఎన్ మూర్తి, బి.శేషగిరిరావు, హనుమంత్ రామ్, జి.గోపాల్‌రావు, ఎ.అంజిరెడ్డి, కుటుంబరావు, టి.నాగరాజు పాల్గొన్నారు.

లాటరీపై ఆసక్తే కొంపముంచింది

- సైబర్ కేటుగాడి వలలో విశ్రాంత ఉద్యోగి
- రూ. 3.18 లక్షలు పోగొట్టుకున్న వైనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేరళ లాటరీలు కొనిపించి, బహుమతి వచ్చిందని నమ్మించి సైబర్ కేటుగాడు మోసం చేశాడు. ఈ ఉదంతం బషీర్‌బాగ్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నగరానికి చెందిన 76 ఏళ్ల వయసున్న రిటైర్డ్ ఉద్యోగి ఫేస్‌బుక్‌లో కేరళ లాటరీకి చెందిన ప్రకటన చూశాడు. ఆసక్తి చూపించి అందులో వివరాలు నమోదు చేశాడు. వెంటనే వాట్సాప్ ద్వారా సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. కేరళ లాటరీ విధానం గురించి వివరించాడు. వెంటనే టికెట్‌లు కొని అదృష్టం పరీక్షించుకోవాలన్నాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు డబ్బు వెచ్చించి మూడు లాటరీలు కొనుగోలు చేశాడు. కొన్ని రోజులకు ఆయన కొన్న మూడింటిలో రెండింటికి కలిపి రూ.17 లక్షల బహుమతి వచ్చిందని నమ్మించాడు. ఈ డబ్బు ఆయన ఖాతాలో జమ కావాలంటే ముందుగా కొన్ని చార్జీలు చెల్లించాలని సూచించాడు. పలు దఫాలుగా రూ.3.18 లక్షలు కాజేశారు. ఇంకా డబ్బులు డిమాండ్ చేయడం, ఫోన్‌కు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ అవినాష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌కు చెందిన కముగంటి శివ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం ఎస్సైకి అందింది. ఉన్నతాధికారి అనుమతి మేరకు దాడి చేసి శివని అదుపులోకి తీసుకొని విచారించారు. లక్ష్మీనరసింహనగర్‌కు చెందిన ఎస్.కార్తీక్, ఎం.సాయిప్రసాద్‌తో కలిసి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

అమీర్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన లోకేశ్వర్‌రావు(62), భార్య సుధారాణి(60) వ్యక్తి గత పని నిమిత్తం స్కూటీపై ఫతేనగర్ వైపు వెళ్తున్నారు. ఆదివారం సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయం బోనం కాంప్లెక్స్ దాటుతుండగా వెనక వైపు అతి వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఓవర్ టేక్ చేసిన సందర్భంలో దాని ముందున్న బంపర్ స్కూటీకి తగిలి కింద పడిపోయారు. దీంతో సుధారాణికి స్వల్ప గాయాలు కాగా, లోకేశ్వర్‌రావు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గ్రూపుల మధ్య గొడవ.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గొడవపడిన రెండు గ్రూపులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టోలిచౌకి ఎస్ఏ కాలనీలో ఈనెల 27న అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ హంగామా సృష్టించారు. అక్కడే పార్కింగ్‌లో ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు అక్కడకు చేరుకొని రెండు గ్రూపులను అదుపులోకి తీసుకున్నారు. గొడవకు కారణమైన షేక్ షోయబ్, మహ్మద్ అఫ్జల్, అబ్దుల్ అజర్, సయ్యద్ అహ్మద్, ఓమర్ ఎండీ సర్వర్, అబుకర్ టిమ్, హుస్సేన్ మరికొందరి పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హర్షసాయి ట్రస్టు పేరుతో మోసం

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హర్షసాయి ట్రస్టు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి సైబర్ నేరగాళ్లు రూ.69 వేలు మోసం చేశారు. షేక్‌పేటకు చెందిన అనురాజ్ యెల్లారం ప్రైవేట్ ఉద్యోగి. గత నెల 10న యూట్యూబ్‌లో హర్షసాయి వీడియో చూసి లైక్ కొట్టాడు. మరుసటి రోజు హర్షసాయి ట్రస్టు నుంచి ఫోన్ చేస్తున్నట్లు ఓ వ్యక్తి మాట్లాడాడు. ఆర్థిక అవసరాలు తీర్చేందుకు ట్రస్టు రెండు లక్షల రూపాయలు ఇస్తుందని చెప్పారు. కాగా, ప్రయాణపు ఖర్చుల నిమిత్తం కొంత డబ్బు కావాలని అడిగాడు. ఇలా మూడు దఫాలుగా అనురాజ్ రూ.69 వేలు పంపించాడు. నేరగాళ్లు ఇంకా డబ్బు కావాలని ఫోన్‌లు చేస్తుండడంతో అనుమానం వచ్చిన అనురాజ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎలక్ట్రిక్ వైర్ మాయం

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ భవనంలో విలువైన ఎలక్ట్రిక్ వైర్ మాయమైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.5 దేవరకొండ బస్తీలో ఓ భవనం నిర్మాణంలో ఉంది. ఈనెల 27న రూ.15 వేల విలువ చేసే ఎలక్ట్రిక్ వైర్ కనిపించకుండా పోయింది. భవనం సూపర్‌వైజర్ నాగభూషణ్‌రెడ్డి వైర్ కోసం అనిచోట్లా వెతికాడు. ఇదే సమయంలో అక్కడ పనిచేసే కుర్బాన్ మొమిన్ కూడా కనిపించకుండా పోయాడు. అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ నాగభూషణ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోదండరెడ్డి

లక్ష్య సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సంకల్పం ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని నీలోఫర్ ఆస్పత్రి వద్ద సోమవారం రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ అగ్రికల్చర్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, నాంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్‌ఖాన్ హాజరై అన్నదానం ప్రారంభించారు. ట్రస్ట్ నిర్వాహకులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఎం.సాధనరెడ్డి మాట్లాడుతూ లక్ష్య సంకల్ప ఆధ్వర్యంలో ఇక నుంచి ప్రతీ వారం నగరంలోని నిమ్స్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి, జయంతి పాల్గొన్నారు.


ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చిన అనంతరం శిశువిహార్ ఆయాలు

శిశువిహార్ ఆయాలకు వేతనాలు ఇవ్వాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలోని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని ఉన్న శిశు విహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు జనవరి, ఫిబ్రవరి, మార్చి వేతనాలు వెంటనే ఇవ్వాలని శిశు విహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) కార్య నిర్వాహక అధ్యక్షుడు ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే వేతనాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.సుశీల, శ్యామల, కవిత, సోమలక్ష్మి, లక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

'కార్యకర్తల కృషితోనే రజతోత్సవ సభ విజయవంతం'

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కృషితోనే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయంతమైందని ఆ పార్టీ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో జరిగిన రజతోత్సవ సభకు జనాలను తీసుకువచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేశారని, సభా ప్రాంగణం కిక్కిరిసిపోయిందని అన్నారు. ముఖ్యంగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా స్వచ్ఛందంగా ప్రజలు బయటకు వచ్చారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విప్లవ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మమ్మ, నాయనమ్మలను సన్మానిస్తున్న అన్నపూర్ణ, ప్రభాఅనంతరెడ్డి

జెక్‌కాలనీలో గ్రాండ్ మా ఉత్సవాలు

బేగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ జెక్‌కాలనీలో గ్రాండ్ మా వేడుకలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. అమ్మమ్మ, నాయనమ్మలకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ప్రభాఅనంతరెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు, క్రమశిక్షణతోనే కుటుంబ సంక్షేమం సాధ్యమన్నారు. నేటి తరం యువత అన్నిరంగాల్లో ముందుకు వెళ్తున్నారని, వారికి తాత, నాయనమ్మ, అమ్మమ్మల కాలం నాటి విషయాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇంట్లో ఉన్న పెద్దలను గౌరవించడంతో పాటు వారి బాటలో పిల్లలు ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, పూర్ణాని, భాగ్యలత, అరుణ్‌జ్యోతి, సుజాత, శ్రీరమణి, ఉమ, మహాలక్ష్మిలను సన్మానించారు.

50 సీసీ కెమెరాలు ఏర్పాటు

బేగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో 50 సీసీ కెమెరాలను ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులతో కలిసి డీసీపీ సురేష్ కుమార్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా డీసీపీ సూచించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.3లోని నివాసంలో 38 మందికి షాదీ ముబారక్, 17 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ యువతకు చేయూతనందించేందుకు రాజీవ్ వికాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. నగరవ్యాప్తంగా కోటి మందికి పైగా బీసీలు ఉంటే కేవలం 30 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అవసరమైతే ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయ సిబ్బంది సహాయం అందిస్తారని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగరావు, రాములు చౌహాన్, శ్రీనివాస్‌యాదవ్, దాత్రిక సింహం, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్, సునీల్ పాల్గొన్నారు.


చెక్కులు తీసుకున్న వారితో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ సంగీతాయాదవ్

కాంట్రాక్ట్ అధ్యాపకులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

- డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ అధ్యాపకులతో ప్రభుత్వం చర్చలు జరపాలని డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ అంబేడ్కర్ వర్సిటీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొన్ని రోజులుగా కాంట్రాక్ట్ అధ్యాపకులు కొనసాగిస్తున్న ధర్నాకు సోమవారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు డా.కె.అవినాష్, ప్రధాన కార్యదర్శి డా.ఎం.కిషోర్, సలహాదారులు డా.కె.యాదగిరి, డా.కాసం విజయ్, ఉపాధ్యక్షులు కె.ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి డా.పి.రాధాకృష్ణ, కోశాధికారి డా.వై.కుమార్, కాంట్రాక్ట్ అధ్యాపకులు డి.కోటేశ్వరరావు, డా.పడాల లక్ష్మణ్, డా.సునీల్ కుమార్, డి.విజయ ఉషశ్రీ, డి.శ్రీవేణి, డా.అరుణ సిద్ధాంతి, డా.కురుమేటి దయాకర్, నర్సయ్య భట్టు, తదితరులు పాల్గొన్నారు.


కాంట్రాక్ట్ అధ్యాపకులకు సంఘీభావం ప్రకటిస్తున్న ప్రొ.ఘంటా చక్రపాణి

సైనిక పిల్లల సహాయార్థం ఫ్యాషన్ షో

బేగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న జేసీఐ, ఉమాంగ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ సరిహద్దులో రక్షణ కోసం పోరాటం చేస్తున్న సైనికుల పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఫండ్ రైజింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్లోరియస్ మిస్ అండ్ మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పేరుతో రెండు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం బేగంపేటలోని ఐఏఎస్ అధికార సముదాయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జేసీఐ సికింద్రాబాద్ ప్యారడైజ్ మద్దతుతో ఎస్ఎస్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఫ్యాషన్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ అండ్ డైరెక్టర్ సేహల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, సబీనా, రిని చతుర్వేది పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సేహల్, క్రాంతి, సబీనా, రిని చతుర్వేది తదితరులు

వందగజాల ఇంటి స్థలం కేటాయించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ గ్రేటర్ ప్రాంతంలో వంద గజాల ఇంటి స్థలం కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలను, ఇంటిని నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన న్యాయమైన డిమాండ్‌ను అమలు చేయకపోగా, ప్రభుత్వ స్థలాలను అమ్మే ఆలోచన చేస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌకలో ఇళ్లులేని ప్రతీ నిరుపేద కుటుంబానికి 100 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, కాచవాని సింగారం, తట్టిఅన్నారం, ఆర్‌కేనగర్ గ్రామం ఘట్‌కేసర్ మండలం మేడ్చల్ జిల్లాలో 2003 నుంచి 2004లో ఇచ్చిన 3వేల పట్టాలకు సర్వే నంబర్ 68లో 100 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గుడిసెవాసుల సంఘం(టీజీవీఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు తెలంగాణ గుడిసెవాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాకి రవి అధ్యక్షత వహించగా, ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బీఎస్ రమేష్‌కుమార్ మాదిగ మద్దతు ప్రకటించారు. ధర్నాలో మల్లేష్, కుశల్, రాజేందర్ పాల్గొన్నారు.

ఐస్ క్రీం టేస్టింగ్ ఛాలెంజ్

పంజాగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీమ్ ప్రేమికులు ఎంతగానో ఎదురుచూసిన ది గ్రేట్ ఇండియన్ ఐస్‌క్రీమ్ టేస్టింగ్ ఛాలెంజ్ 3వ ఎడిషన్ పోటీ ఆదివారం రాత్రి ఎర్రమంజిల్‌లోని నెక్స్ట్ ప్రీమియా మాల్‌లో జరిగింది. ఐస్‌క్రీమ్ ప్రేమికులంతా ఒక్కచోట చేరారు. కళ్లకు గంతలు కట్టుకుని ఐస్‌క్రీం టేస్ట్ చేసి ఫ్లేవర్ చెప్పడం కొత్తగా అనిపించిందని పోటీలో పాల్గొన్న వారు చెప్పారు. చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా వెయ్యి మంది వరకు ఈ పోటీలో పాల్గొన్నారు. సుచిత్ర సర్కిల్ ప్రాంతానికి చెందిన శృతి పది ఫ్లేవర్లు చెప్పి రూ.లక్ష, బర్కత్‌పురాకు చెందిన విధాత్రి ఏడు ఫ్లేవర్లు చెప్పి రూ.50 వేలు, శ్రీనగర్‌కాలనీకి చెందిన యశస్వి ఆరు ఫ్లేవర్లు చెప్పి రూ.25 వే నగదు బహుమతిని గెలుచుకున్నారు. లక్కీ డ్రా ద్వారా 25 మంది విజేతలను కూడా ఎంపిక చేసి బహుమతులు ఇచ్చారు. ఐస్‌క్రీం తినేందుకు ప్రత్యేకమైన కారణాలు అక్కర్లేదని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ వైస్ ఛైర్ పర్సన్ డాక్టర్ ప్రీతిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నటి, నిర్మాత సుమయారెడ్డి, ప్రముఖ ఆర్జే శేఖర్‌బాషా, నటి, బిగ్ బాస్ ఐదో కాంటెస్టెంట్ శ్వేతావర్మ, నిర్వాహకులు ఎం.రాజ్‌గోపాల్, డాక్టర్ జె. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



శృతికి చెక్కును అందజేస్తున్న ప్రముఖులు

మే 10 నుంచి బాల కళావికాస్ ఆర్ట్ షో, వర్క్‌షాప్

పంజాగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని ఎం.ఈశ్వరయ్య ఆర్ట్ గ్యాలరీలో మే 10 నుంచి 14 వరకు 6 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు వారి కోసం బాల కళావికాస్ ఆర్ట్ షో, వివిధ కళా పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని గ్యాలరీ నిర్వాహకులు ఎం.సంజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పిల్లలు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, విభిన్న కళా పద్ధతులను నేర్చుకునేందుకు ప్రోత్సహించడమే ఈ వర్క్‌షాప్ ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. పిల్లలు గిసిన కళాకృతులను ప్రదర్శించి అమ్మకానికి ఉంచుతామని, అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవ కోసం విరాళంగా ఇస్తామని ఆయన తెలిపారు. పెన్సిల్ స్కెచింగ్, ఒరిగామి, కాలిగ్రఫీ, ట్రెండీ గ్లాస్ పెయింటింగ్, జైపూర్ బ్లూ పాటరీ, డోనట్ ఫొటో ఫ్రేమ్ వంటి కళా పద్ధతులను నేర్పిస్తామని తెలిపారు. వివరాలకు 93913 55110లో సంప్రదించాలని ఆయన సూచించారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

మారేడుపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యల కారణంతో వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7 లక్షల ఆర్థిక సహాయ మంజూరు పత్రాలను(ఎల్‌ఓసీ) అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషు కుమారి, నాయకులు బాల్‌రెడ్డి, హన్మంతరావు, అశోక్ యాదవ్, ఖలీల్, శేఖర్, కూతురు నర్సింహ, బలరాం, వనం శ్రీనివాస్, జమీర్, వసీం, బాస లక్ష్మీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభ అందుకు నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ విజయవంతం చేసేందుకు కృషి చేసిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

ఆర్పీఎఫ్ పోలీసుల తనిఖీలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భద్రత విషయంలో తాము అప్రమత్తంగా ఉన్నామని నాంపల్లి రైల్వేస్టేషన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపారు. రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో ప్రయాణికులు అపోహలకు గురిగాకుండా ఉండేందుకు అవగాహన కరపత్రాలు పంచుతున్నామని పేర్కొన్నారు. అనుకోని ఆపద వస్తే 139 నంబరుకు కాల్ చేసి సమాచారం అందిస్తే ఆర్పీఎఫ్ పోలీసులు రక్షణగా ఉంటారని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో ఉన్న వెయిటింగ్ హాళ్లు, స్టాళ్లు, స్టేషన్‌కు వచ్చే అనుమానితులను విచారించి ఐడీ కార్డులు పరిశీలిస్తున్నామన్నారు. అంతేకాకుండా నాంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లలో ఆగుతున్న ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో ఆర్పీఎఫ్ పోలీసులతో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఆర్పీఎఫ్ పోలీసుల డాగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.



ప్రయాణికుల ఐడీ కార్డులను తనిఖీలు చేస్తున్న నాంపల్లి ఆర్పీఎఫ్ సీఐ కల్పన

క్రైమ్ సమాచారం

పాము కాటుతో మహిళ మృతి

బోయినపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ వివరాల ప్రకారం కర్ణాటకకు చెందిన బసవరాజు అతని భార్య రాములమ్మ (24)లు బతుకు తెరువు కోసం బోయినపల్లికి వచ్చి న్యూ బోయిన్‌పల్లిలోని లగ్జరీ గ్రీన్ విల్లాలో రెండు సంవత్సరాలుగా వాచ్‌మన్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 26న రాత్రి బాగా వేడిగా ఉండడంతో ఆమె గది తలుపులు తీసి నిద్రించింది. అర్ధరాత్రి 3 గంటల సమయంలో ఆమెకు ఏదో కుట్టినట్లు అనిపించి లేచి చూడగా అటుగా పాము వెళ్తుండడం చూసి అరవడంతో భర్త కాలనీవాసులను పిలిచి ఆ పామును చంపేశారు. పామును విషసర్పంగా గుర్తించిన కాలనీవాసులు తెలపడంతో ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె సోమవారం రాత్రి మృతి చెందింది. దీంతో కాలనీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

ఫ్యాన్‌కు ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

బౌద్ధనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మరో ఆరురోజుల్లో ఎంగేజ్‌మెంట్ ఉండగా ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలు ప్రకారం బౌద్ధనగర్‌కు చెందిన గడ్డం లక్ష్మీకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. భర్త ముత్యాలు గతంలో మృతి చెందాడు. లక్ష్మీ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ పని చేస్తుంది. పెద్దకుమారుడు, కుమార్తెకు వివాహాలు అయి వారు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. రెండో కుమారుడు గడ్డం మోహన్‌కృష్ణ(30) ముషీరాబాద్‌లో మెకానిక్ షాపును నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9:30కు తల్లి నైట్‌డ్యూటీకి వెళ్లగా అతడు ఇంటిలో ఒక్కడే ఉన్నాడు. సోమవారం ఉదయం 10:30లకు తల్లి ఇంటికి రాగా తలుపులు మూసి ఉన్నాయి. కుమారుడికి ఫోన్ చేయగా ఎంతకీ తీయకపోవటంతో పెద్దకుమారుడికి ఫోన్‌చేసి విషయం చెప్పింది. పెద్ద కుమారుడు ఇంటికి వచ్చి స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టగా మోహన్‌కృష్ణ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. ఈ విషయమై వారు వారాసిగూడ పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తంగా గాంధీమార్చురీకి తరలించారు. మోహన్‌కృష్ణ ఆత్మహత్యకు కారణాలు తెలియని మే 4వ తేదీన ఎంగేజ్‌మెంట్ ఉందని తల్లి పోలీసులకు తెలిపింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం



అన్సారీ ఖాతూన్

అడ్డగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం సికింద్రాబాద్‌కు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ వివరాల ప్రకారం బీహార్ మధుబనీ, బెనీపాట్ తాలూకా, నజీరా గ్రామానికి చెందిన అన్సారీ ఖాతూన్(70) అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయమై కొడుకు హైదరాబాద్ రావాలని సూచించగా ఆమెతో పాటు మరో వ్యక్తి ఈస్తన్ అన్సారీ ఇద్దరూ కలిసి 22న సికింద్రాబాద్ వచ్చారు. అన్సారీ మొదట ఖాతూన్‌ను స్టేషన్ బయట ఉంచి లగేజీ తీసుకొస్తానని లోపలికి వెళ్లి వచ్చేసరికి ఖాతూన్ కనిపించలేదు, రైల్వేస్టేషన్ చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేయగా ఫలితం లేకపోయింది. ఆమె కొడుకు మహ్మద్ వారీస్ సోమవారం గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో తన తల్లి అదృశ్యమైందని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం.. హైదరాబాద్‌లో ప్రత్యక్షం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఓ ఐదేళ్ల బాలుడిని బేగంపేట్ ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీశారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన వివరాల ప్రకారం పెద్దపల్లికి చెందిన ఐదేళ్ల బాలుడు ఇంటి నుంచి పారిపోయి సోమవారం నేచర్ క్యూర్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో ఒంటరిగా తిరుగుతున్నాడు. ఆ సమయంలో ఆర్పీఎఫ్ ఎస్సై సెల్వరాజు బాలుడిని గమనించి చేరదీసి బేగంపేట్ రైల్వేస్టేషన్ ఆర్పీఎఫ్ ఎస్సై సయ్యదా తహ్సీనాతో వివరాలు సేకరించేందుకు ప్రయత్నం చేశారు. బాలుడు నుంచి కొన్ని వివరాలు సేకరించగా బాలుడు సొంత గ్రామం పెద్దపల్లి అని, ఎంఎంటీఎస్ రైలు దిగానంటూ చెబుతున్నాడని విచారణలో వెల్లడైంది. బాలుడిని రైల్వే టీటీలు మనీషా, సంతోష్ కుమార్‌లకు అప్పగించి తర్వాత 1098కు సమాచారం ఇచ్చామన్నారు.



బాలుడిని చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

మ్యాన్ 'హెల్స్'!

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయ లోపంతో రాంగోపాల్‌పేట్ డివిజన్ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరి నిర్లక్ష్యంతో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల మూతలు కుంగిపోయి, ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. దీనితో ఆ రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోళ్లకు పైకప్పులు పగిలిపోయి, లోపలికి కుంగిపోయి ఉన్నాయి. దీనితో వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లాలాటెంపుల్ స్ట్రీట్‌లో

లాలా టెంపుల్ స్ట్రీట్‌లో పోచమ్మ ఆలయం వెళ్లే దారిలో కూడా మ్యాన్‌హోళ్ల స్థితి దీనస్థితిలో ఉంది. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది.

చిత్ర దర్గా వద్ద

కరోనా సమయంలో నాలాను నిర్మించి వర్షపు నీరు సులభంగా పోవడానికి స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మించారు. ఎప్పుడు చూసిన డ్రైయిన్ పైకప్పు కుంగిపోయి వాహనదారులకు ఇబ్బందులను కలుగచేస్తుంది. ఇబ్బందులు కొంత కాలం లేకపోయినప్పటికీ ప్రస్తుతం మెదలయ్యాయని వ్యాపారులు తమ వ్యధను వెళ్లగక్కుతున్నారు.



లాలా టెంపుల్ స్ట్రీట్

మమతా స్వీట్ హౌస్ లేన్‌లో

పీజీ రోడ్డులోని మమతా స్వీట్ హౌస్ నుంచి నల్లగుట్ట వైపు వెళ్లే దారిలో వర్షపు నీరు వెళ్లడానికి ఓ డ్రయిన్‌ను నిర్మించారు. నిర్వహణ లోపంతో అది ధ్వంసమై వాహనాదారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



ఆర్పీ రోడ్డులోని చిత్ర దర్గా

వాహనాదారులను కాపాడాలి



మ్యాన్‌హోళ్ల నిర్వహణలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వాటిపై మూతలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- అశోక్, లాలా టెంపుల్ స్ట్రీట్ నివాసి

అధికారుల నిర్లక్ష్యం



అధికారులు విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బందులు ఉండవు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా వారు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆశిస్తున్నాం.

- గౌరీనాథ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



మమతా స్వీట్ హౌస్ లేన్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 15 రోజుల్లో అందజేస్తాం

● సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం

మారేడుపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఓల్డ్ మారేడుపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులకు 15 రోజుల్లో అలాట్‌మెంట్ చేస్తామని సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓల్డ్ మారేడుపల్లిలో అక్రమంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఉంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించారు. ఓల్డ్ మారేడుపల్లిలో మొత్తం 22 బ్లాకుల్లో 468 డబుల్ రూమ్ ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. తొలివిడతగా 2022లో 273 మందికి ఇళ్లను అలాట్‌మెంట్ చేసి లబ్ధిదారులకు అందజేశామన్నారు. 49 మంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆక్రమించి నివాసం ఉంటున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందగా ఈమేరకు అధికారులు సోమవారం ఉదయం 6.30 నుంచి పదిన్నర వరకు విచారణ నిర్వహించారు. ముందస్తు భద్రతకు పోలీసు బలగాలు, అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. సికింద్రాబాద్ ఆర్‌డీఓ సాయిరామ్ అధ్వర్యంలో అధికారులు ఎంక్వైరీ చేసి 16 ఇళ్లకు తాళాలు వేశారు. మిగతావారి పేర్లు రెండో విడత లబ్ధిదారుల జాబితాలో ఉన్న నేపథ్యంలో వారికి ఇళ్ల కేటాయింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. 15 రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేసి మొత్తం 195 మందికి పైగా అందేలా చూస్తామన్నారు. మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ.... తొలి విడత జాబితా విడుదలై మూడేళ్లు కావస్తున్నా ఇప్పటికీ రెండో విడత ఇళ్ల కేటాయింపు జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్, మారేడుపల్లి, తిరుమలగిరి తహసీల్దార్లు భీమయ్య గౌడ్, అశోక్, పోలీస్ ఉన్నతాధికారులు, మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ ఎన్ వెంకటేశం, డాక్టర్ విశాల్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల సర్వే వివరాలను ఆర్డీఓను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్



ఓల్డ్ మారేడుపల్లి డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద పోలీస్ బందోబస్తు



అమ్మమ్మ, నాయనమ్మలను సన్మానిస్తున్న అన్నపూర్ణ, ప్రభాఅనంతరెడ్డి

జెక్‌కాలనీలో గ్రాండ్ మా ఉత్సవాలు

బేగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ జెక్‌కాలనీలో గ్రాండ్ మా వేడుకలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. అమ్మమ్మ, నాయనమ్మలకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ప్రభాఅనంతరెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు, క్రమశిక్షణతోనే కుటుంబ సంక్షేమం సాధ్యమన్నారు. నేటి తరం యువత అన్నిరంగాల్లో ముందుకు వెళ్తున్నారని, వారికి తాత, నాయనమ్మ, అమ్మమ్మల కాలం నాటి విషయాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇంట్లో ఉన్న పెద్దలను గౌరవించడంతో పాటు వారి బాటలో పిల్లలు ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, పూర్ణాని, భాగ్యలత, అరుణ్‌జ్యోతి, సుజాత, శ్రీరమణి, ఉమ, మహాలక్ష్మిలను సన్మానించారు.



కొవ్వొత్తుల ర్యాలీ

ఉగ్రదాడిలో అమరులైన వారికి శ్రీనివాసనగర్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. విశ్వకర్మ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, సభ్యులు మహత్మాచారి, రాళ్లబండి విష్ణు, బి.రవీంద్రచారి, చేపూరి వెంకటేశ్, కృష్ణ, కాలనీవాసులు నివాళులర్పించారు.

- (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులతో ముఖాముఖి

బోయినపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే విద్యార్థులు తమ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగాలని సికింద్రాబాద్ విద్యాపీఠ్ అధినేత, ఫిజికల్ ట్రైనర్ అఖిల్ పాండే పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో సోమవారం 3,500 మంది విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యచరణ ఏవిధంగా ఉండాలో ఆయన దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. తెలంగాణ విద్యాపీఠ్ చైర్మన్ రాజురెడ్డి, సీఈఓ మునీందర్, జనరల్ మేనేజర్ శివంగి గోగుల తదితరులు పాల్గొన్నారు.

సైనిక పిల్లల సహాయార్థం ఫ్యాషన్ షో

బేగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న జేసీఐ, ఉమాంగ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ సరిహద్దులో రక్షణ కోసం పోరాటం చేస్తున్న సైనికుల పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఫండ్ రైజింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్లోరియస్ మిస్ అండ్ మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పేరుతో రెండు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం బేగంపేటలోని ఐఏఎస్ అధికార సముదాయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జేసీఐ సికింద్రాబాద్ ప్యారడైజ్ మద్దతుతో ఎస్ఎస్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఫ్యాషన్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ అండ్ డైరెక్టర్ సేహల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, సబీనా, రిని చతుర్వేది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సేహల్, క్రాంతి, సబీనా, రిని చతుర్వేది తదితరులు



రైల్వే ఆస్పత్రికి వీల్ చైర్లను అందజేసిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు

రైల్వే ఆస్పత్రికి రోటరీ క్లబ్ వీల్‌చైర్ల వితరణ

అడ్డగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రతినిధులు సికింద్రాబాద్ మెట్టుగూడ లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రికి 50 వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం మాట్లాడుతూ సమాజంలో రోటరీ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉందని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. రైల్వే ఆస్పత్రి ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మల రాజారాం, డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్, రైల్వే మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శివనాగ ప్రసాద్, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి, జిల్లా గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రాంప్రసాద్, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డిలు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై మంత్రులు అవాకులు, చవాకులు తగదు

సికింద్రాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వ పాలనపై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు నూటికి నూరుశాతం వాస్తవమని, అయితే దీనిని జీర్ణించుకోలేని మంత్రులు కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. కేసీఆర్ చెప్పిన వాస్తవాలను ప్రజలు స్వాగతించారని, అయితే మంత్రులు మాత్రం ఆత్మవంచన చేసుకుని, వ్యవహరిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

సభకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారని, మల్కాజిగిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి సమన్వయంతో కంటోన్మెంట్ పాలకమండలి మాజీ సభ్యులు, వివిధ పాలక మండళ్ల మాజీ అధ్యక్షులు, మాజీ సభ్యులు, పార్టీ కార్యకర్తల సమిష్టిగా కృషి చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ ప్రజల విముక్తి కోసం అనేక ఉద్యమాలు చేసిన ఘనత ఎంసీపీఐ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదే మల్లేష్ అన్నారు. అడ్డగుట్టలోని ఎంసీపీఐ కార్యాలయంలో సోమవారం అమరవీరుల, అమరజీవుల సంస్మరణ సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ గ్రేటర్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్, కార్యదర్శి కార్యవర్గ సభ్యులు ఇస్తావత్, దశరథ్ నాయక్, కిష్టయ్య, యాదగిరి, లక్ష్మణ్, రాజేష్, గురువయ్య, రమేష్‌లు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ : సంగీత

అడ్డగుట్ట ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత అన్నారు. సోమవారం సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లోని మొండిబండ గుడిసెల బస్తీలో పర్యటించి బస్తీవాసుల నుంచి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఉన్న గుడిసె వాసులకు ఏ ప్రభుత్వం శాశ్వత ఇళ్లను కట్టించలేదన్నారు. ఇక్కడ ఉన్న అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య సభ్యురాలు రామలీల, భారతి, లక్ష్మి, వీణ, నీరజలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీ

ఉగ్రవాదుల చేతుల్లో మృతి చెందినవారి ఆత్మలకు శాంతిచేకూరాలని బొల్లారం రిసాలబజార్‌లో సోమవారం కంటోన్మెంటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మనోజ్, చిన్నారులు పాల్గొన్నారు. తిరుమలగిరి బంజారానగర్ కాలనీలో 7 కాలనీలకు చెందిన కమిటీ సభ్యులు కమ్యూనిటీ హాల్‌లో కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఆత్మశాంతి చేకూర్చాలని ప్రార్థించారు. పీఎం సహాయనిధి కోసం ప్రతీ ఒక్కరూ 1116 రూపాయలు పంపించారు. కార్యక్రమంలో నర్సింహ, వైవీ రావు తదితరులు పాల్గొన్నారు. **- తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి)**



క్లాక్ టవర్ సర్కిల్ వద్ద అమరవీరుల స్తూపం సమీపంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సికింద్రాబాద్ న్యూస్ పేపర్ హాకర్స్ అసోసియేషన్ సభ్యులు

క్లాక్ టవర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

సికింద్రాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యటన కోసం వెళ్లిన ప్రయాణికులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, సికింద్రాబాద్ న్యూస్ పేపర్ హాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆరు గంటలకు క్లాక్ టవర్ సర్కిల్ వద్ద అమరవీరుల స్తూపం సమీపంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అధ్యక్షుడు తమ్మిగొండ శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పర్యాటకులుగా వెళ్లి ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు తమ ఐక్యతను చాటుతూ, ఉగ్రదాడిలో బలైన అమరులను స్మరించుకుంటూ వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. 'ఉగ్రవాదం నశించాలి', 'భారత్ మాతా కీ జై' అనే నినాదాలతో క్లాక్ టవర్ పరిసర ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో సాయికుమార్, కె.పి. వెంకటేష్, రవి, చంద్రశేఖర్, సాయి యాదవ్, ప్రేమ్, శ్రీరాములు, నరేష్, శంకు, సురేష్, శివాజీ, టి రవి, ఎన్ ఆర్ సాయిబాబా, ప్రభాకర్, సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉగ్రదాడికి వ్యతిరేకంగా గాంధీలో ర్యాలీ నిర్వహించిన వైద్యులు

ఉగ్రదాడికి వ్యతిరేకంగా వైద్యుల ర్యాలీ

అడ్డగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులపై కాల్పులకు పాల్పడిన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని గాంధీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ భూపేష్ రాథోడ్ డిమాండ్ చేశారు. కాల్పులను ఖండిస్తూ సోమవారం గాంధీ ఆస్పత్రి వైద్యులతో పాటు ప్రభుత్వ వైద్యులు, నర్సులు ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభం శుభం తెలియని విదేశీయులు, పర్యాటకులు మరణించడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిర, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ సుబోధ్, ఆర్‌ఎంఓ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, ఆర్‌ఎంఓ డాక్టర్ శేషాద్రి, ప్రభుత్వ వైద్యుల సంఘం వైద్యులు అబ్బయ్య. మురళీధర్, రవి, కల్యాణ్, మదన్, సందీప్ కుమార్, బ్రహ్మేశ్వర అనిల్, నాజిం, మీనాక్షి, సరిత, నవీన్, జూడా ప్రతినిధులు అజయ్‌లతోపాటు నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఈసీసీ డే

అడ్డగుట్ట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్‌లోని మరాఠబస్తీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం ఈసీసీ డే కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా టీచర్ శోభ మాట్లాడుతూ అంగన్‌వాడీలో చదువుకుంటున్న చిన్నారులకు ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే చదువుపై శ్రద్ధ అవసరమని సూచిస్తున్నామన్నారు. సెంటర్‌లో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు, బస్తీ నాయకుడు గోపిలతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

50 సీసీ కెమెరాలు ఏర్పాటు

బేగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో 50 సీసీ కెమెరాలను ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులతో కలిసి డీసీపీ సురేష్ కుమార్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా డీసీపీ సూచించారు.